క్లుప్తంగా

యోగా పోటీల్లో ప్రతిభ



పాండిచ్చేరి సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న కావ్యశ్రీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన కావ్యశ్రీ ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా యోగా గురువు ప్రసన్నకుమార్ మాట్లాడారు. పాండిచ్చేరిలో ఈ నెల్లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా పోటీల్లో అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన కావ్యశ్రీ 35 నుంచి 45 ఏళ్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. పాండిచ్చేరి సీఎం రంగస్వామి చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారని పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్లను కలెక్టరేట్ ఆవరణలోని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సంఘంలో నేతగా ఎన్నికైన సుబ్రహ్మణ్యాన్ని అభినందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కందల శ్రీనివాసులు, నేతలు శ్రీనివాసులు, మల్లిక, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో రంగడి దర్శనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని కనులపండువగా సోమవారం నిర్వహించారు. స్వామి వారు ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువై ఉత్తర ద్వారం నుంచి భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తగా నరసింహులుశెట్టి వ్యవహరించారు.

• ఆండాళ్ అమ్మవారి ప్రాకారోత్సవాన్ని మంగళవారం ఉదయం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఐ ప్యాడ్ల చోరీ

నెల్లూరు(క్రైమ్): వైద్య విద్యార్థుల ఐ ప్యాడ్లను చోరీ చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వెంకటశ్రీచందన్ ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. అక్కడి హాస్టల్లో మరో విద్యార్థితో కలిసి ఉంటున్నారు. ఈ నెల నాలుగో తేదీన గుర్తుతెలియని దుండగులు అతని గదిలోకి ప్రవేశించి రెండు ఐ ప్యాడ్లను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష కేంద్రాల్లో పరిశీలన

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల, చింతచెలికలోని ఓవెల్–18 పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలను ఎంఈఓ జి.వసంత కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అన్ని వసతులతో పరీక్షలు నిర్వహిస్తుండడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎంలు సీహెచ్ లక్ష్మీప్రసూన, హరిబాబు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

వెంకటాచలం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని కంటేపల్లి ఎస్సీకాలనీలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సీఐ గంగాధర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు కర్నాటి శివకుమార్, మహేష్ పాల్గొన్నారు.

'స్పందన'తో సమస్యలకు పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం లభించిందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై అర్జీలను చైర్‌పర్సన్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నా రాజకీయ జీవితమే పోరాటం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తన రాజకీయ జీవితమే పోరాటాలతో మొదలైందని.. కలిసేవారు కలుస్తారు... విడిపోయే వారు విడిపోతుంటారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగర నియోజకవర్గ పరిశీలకుడు యల్లసిరి గోపాల్‌రెడ్డితో కలిసి నగరంలోని 48వ డివిజన్ పొర్లుకట్ట, జయలలితనగర్ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. స్థానికుల సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. వెన్నుపోట్లు, పోరాటాలు తనకేమీ కొత్త కాదని, మంత్రి పదవి కోల్పోయిన అనంతరం చాలా విషయాలు తెలిసొచ్చాయన్నారు. పదవి లేదు.. ఇంకెందుకని వేరే దగ్గర చాలా మంది చేరడాన్ని చూశానని తెలిపారు. సొంత వారెవరో.. బయటి వారెవరో అర్థమైందని పేర్కొన్నారు. ప్రస్తుత కార్పొరేటర్ తనతో ప్రయాణం చేయడం లేదని.. దీంతో ఇన్‌చార్జిని నియమించాల్సి వచ్చిందన్నారు. తనతో విభేదించిన కార్పొరేటర్ల డివిజన్లలో ఇన్‌చార్జీలను నియమించుకున్నానని చెప్పారు. భగవంతుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నగర నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. తనపై ఆర్టికల్స్ రాస్తే ప్యాకేజీలు వచ్చి కుటుంబాలు బాగుంటాయంటే తనకు సంతోషమేనని తెలిపారు. ఎవరేమీ రాసుకున్నా తనకెలాంటి అభ్యంతరం లేదన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు కొనసాగాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు పింఛన్లు కొనసాగేలా చర్యలు చేపడతామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 14, స్పందనకు 35 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని విభాగాలు పనిచేయాలని ఆదేశించారు. అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని పేర్కొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకం



సంబరాలు జరుపుకొంటున్న గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు

నెల్లూరు(సెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లయిన సందర్భంగా నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌తో కలిసి కేక్‌ను సోమవారం కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అందరి కష్టాలను తెలుసుకొని.. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రతి హామీని నెరవేరుస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌వి చిల్లర రాజకీయాలని.. వారు విలువల్లేని వ్యక్తులని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసిన చంద్రబాబును ఎప్పటికీ నమ్మరని చెప్పారు.

వైఎస్సార్‌కు నివాళి

నెల్లూరు రూరల్: ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లయిన సందర్భంగా కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చీరల పంపిణీ

పెద్దచెరుకూరులోని ఎస్టీ కాలనీలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. మేయర్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రెయిన్ల ప్రారంభం



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 12వ డివిజన్ పెద్దచెరుకూరు ఎస్టీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్లను మేయర్ స్రవంతితో కలిసి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రెండో డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్, నేతలు జయవర్ధన్, రామ్మోహన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, మురళీరెడ్డి, ప్రసన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సౌకర్యాన్ని కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోమశిల, కండలేరు జలాశయాల నుంచి రాపూరు మండలానికి నీటి సౌకర్యాన్ని కల్పించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ చక్రధర్‌బాబు, తెలుగు గంగ పర్యవేక్షక ఇంజినీర్ హరినారాయణరెడ్డికి వినతిపత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రెండు ప్రధాన జలాశయాలు ఉన్నా, రాపూరు మండలానికి నీటి సౌకర్యం లేదని చెప్పారు. సాయిశ్రీనివాసులు, రాధాకృష్ణ, ప్రవీణ్‌కుమార్, విష్ణువర్ధన్, జయచంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



నెల్లూరు రూరల్: పొట్టేపాళెం సమీపంలో పెన్నానది ఒడ్డున నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్‌ఈబీ – 2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఐదుగురితో పాటు నాలుగు పందెం కోళ్లు, రూ.1550 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడారు. కోడి పందేలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు(అర్బన్): జిల్లాలో దళితులపై దాడులు జరుగుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నాను సోమవారం చేపట్టారు. అనంతరం కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా కార్యదర్శి తిరుపాల్, నేతలు రఘురామయ్య, పెంచల నరసయ్య, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

• పరిశ్రమల పేరిట తమ వద్ద తీసుకున్న భూములను తిరిగిచ్చేయాలని కోరుతూ ఆమంచర్ల గ్రామానికి చెందిన పలువురు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళనను చేపట్టారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, సహాయ కార్యదర్శి వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): హరనాథపురం సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని ఏఈ దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్థసారథినగర్, ఆకుతోట, హరనాథపురంలోని అన్ని వీధులు, సర్వేపల్లి కాలువకట్ట, ఆదిత్యనగర్, అపోలో ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

నేత్రదానం



వెంకటసుబ్బయ్య (ఫైల్)

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టకు చెందిన వెంకటసుబ్బయ్య (92) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. నేత్రదాత కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. శేఖర్ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నతంగా రాణించాలి

నెల్లూరు(బృందావనం): విద్యతో ఉన్నతంగా రాణించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో స్మాలర్ స్కాలర్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. దేశభక్తిని పెంపొందిస్తూ డ్యాన్స్ మాస్టర్ రాజు ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్డియాలజిస్ట్ భక్తవత్సలరెడ్డి, కరస్పాండెంట్ పద్మజారెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కార్తికేయరెడ్డి పాల్గొన్నారు.

12న 4కే రన్



మాట్లాడుతున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి 4కే రన్‌ను ఈ నెల 12న నిర్వహించనున్నామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని బీజేవైఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. రిజిస్టర్ చేసుకున్న మొదటి 200 మందికి టీ షర్టులను ఉచితంగా అందజేయనున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అందరూ పాల్గొనవచ్చని.. ఎంట్రీకి ఎలాంటి రుసుము లేదన్నారు. మంగళవారం లోపు రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 83743 37632, 85006 50650 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే సంక్షేమ పాలన ప్రస్తుతం అందుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 26వ డివిజన్లో గల చంద్రమౌళీనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులకు కరపత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి పథకాలను అందించే అంశంలో తాను అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ సుప్రజ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పురుషోత్తమ్‌యాదవ్, నరసింహ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలతో ముందుకెళ్తా



ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని తటస్థులు, పెద్దల సూచనలు, సలహాలతో ప్రజల్లోకి వెళ్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 21, 22వ డివిజన్లకు సంబంధించిన తటస్థుల దీవెన కార్యక్రమాన్ని బీవీనగర్‌లోని సిద్దార్థ స్కూల్లో నిర్వహించారు. సమావేశానికి హాజరైన వారి నుంచి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందుకు హాజరయ్యారు. కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 21వ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్‌కు కళాత్మక శుభాకాంక్షలు



నెల్లూరు(బృందావనం): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని లక్ష తిరునామం, కల్యాణ తిలకంతో తీర్చిదిద్దిన వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు చిత్రపటాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరుకు చెందిన కళాకారుడు చంద్ర అందజేశారు. మినీబైపాస్ రోడ్డులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో స్వామివార్ల చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఎమ్మెల్యే అనిల్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ వ్యక్తిత్వంపై మచ్చ తీసుకొచ్చేలా మాట్లాడితే సహించేదిలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి హంజా హుస్సేనీ పేర్కొన్నారు. జెండావీధిలోని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేపై ఐఎన్టెల్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సమీ చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. అనిల్‌పై అవినీతి ఆరోపణలు చేయడంతో పాటు ముస్లింలను అణగదొక్కుతున్నారని.. తన హత్యకు కుట్ర చేస్తున్నారంటూ విలేకరుల సమావేశంలో సమీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని చెప్పారు. ఎమ్మెల్యే ఎదుగుదలను చూసి ఓర్వలేని కొందరు ప్యాకేజీలిచ్చి ఇతరులతో ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. అనిల్ వద్ద లబ్ధి పొందలేదని సమీ ప్రమాణం చేయగలరానని సవాల్ విసిరారు. మునీర్ సిద్ధిఖ్, సిద్ధిఖ్ పాల్గొన్నారు.

పాఠశాలను పునఃప్రారంభించరూ..



ఏడీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ఉదయగిరి మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, ఏడుకొండలు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. అనంతరం పలు సమస్యలను తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

నెల్లూరు(అర్బన్): ఎంతో కాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు అర్జీదారులు తరలివచ్చారు. తమ సమస్యలపై కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాలను అందజేశారు.

కోవూరు కలుజుపై వంతెన నిర్మించాలి



కోవూరు చెరువు కలుజు ప్రాంతం మీదుగా బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, తదితర మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో దాదాపు మూడు నెలల పాటు రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో సచివాలయ ఉద్యోగి సైతం కొట్టుకుపోయారు. ఇక్కడి కలుజుపై వంతెనను నిర్మించాలి

– శేషయ్య, పెద్దబ్బయ్య, విజయ్‌కుమార్

పింఛన్ ఇచ్చి ఆదుకోరూ..



నా వయస్సు 81 ఏళ్లు. గతంలో పింఛన్ వచ్చేది. ఆంజనేయస్వామి గుడిలో పూజారిగా ఉన్న నాకు చుట్టుపక్కల వారు కొంత సమకూర్చి నెలకు రూ.మూడు వేలను ఇచ్చేవారు. ప్రభుత్వమిచ్చే పింఛన్‌తో పాటు స్థానికులు అందజేసిన నగదుతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడ్ని. పింఛన్ ఆగిపోవడంతో ఇబ్బంది పడుతున్నా. సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి.

– కృష్ణమాచార్యులు, మూలాపేట